# ఆహ్లాదం.. ఆనందం!

- సీబీఆర్‌లో ఆకర్షిస్తున్న పార్కులు, బోటింగ్
- పెరుగుతున్న పర్యాటకుల ఆదరణ



నీటితో కళకళలాడుతున్న సీబీఆర్

**తాడిమర్రి:** ఇటు శ్రీసత్యసాయి జిల్లా అటు వైఎస్సార్ జిల్లాల సరిహద్దులో నిర్మించిన సీబీఆర్ (చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)కు ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచుతోంది. తాడిమర్రి మండల సరిహద్దు, వైఎస్సార్ జిల్లా లింగాల మండలం పార్నపల్లి వద్ద చిత్రావతి నదిపై 1990లో 10 టీఎంసీల నీటి సామర్థ్యంతో పులివెందుల నియోజకవర్గ ప్రజలకు తాగునీరు అందించడంతో పాటు తుమ్మలమల యురేనియం ప్లాంట్‌కు నీరు అందించడానికి, ఉమ్మడి అనంతపురం జిల్లాలో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజక వర్గాల ప్రజలకు తాగు నీరు అందించడానికి రిజర్వాయర్ నిర్మాణం ప్రారంభించారు. పనులు నాసిరకంగా జరుగుతున్నాయని గుర్తించిన ప్రభుత్వం 1993లో అప్పటి వరకు జరిగిన గ్రావెల్ లేయర్‌ను తొలగించింది. కొత్తగా మరో రూ.35 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. 2004లో ముఖ్యమంత్రి అయిన వైఎస్ రాజశేఖరరెడ్డి రిజర్వాయర్ నిర్మాణానికి మరో రూ.90 కోట్ల నిధులను విడుదల చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా తాడిమర్రి మండలం పెద్దకోట్ల, మోదుగులకుంట, గుడ్డంపల్లి, మర్రిమాకులపల్లి, చిన్నచిగుళ్లరేవు, ముదిగుబ్బ మండలం చిన్నకోట్ల, మొగలిచెట్లపల్లి, యర్రగుంటపల్లి, బూదనాంపల్లి, పెద్దచిగుళ్లరేవు, ఉప్పలపాడు తదితర గ్రామాలు, భూములు ముంపుతో సీబీఆర్ నిర్మాణం పూర్తయింది.

**రూ.5.5 కోట్లతో సౌకర్యాలు**

గతేడాది అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకించి పర్యాటకుల సౌకర్యాలు, వసతుల కల్పన కోసం రూ.5.50 కోట్లు విడుదల చేశారు. దీంతో సీబీఆర్ వద్ద రెస్టారెంట్ నిర్మాణం, పార్క్ ఆధునీకరణ, వైఎస్సార్ విగ్రహం ఏర్పాటుతో పాటు డ్యామ్‌లో పర్యాటకుల కోసం బోట్లను ఏర్పాటు చేశారు. నలుగురు సామర్థ్యంతో స్పీడు బోటు టికెట్ ధర రూ.150, ఎనిమిది మందితో టికెట్ ధర రూ.75తో పాటు 26 మంది సామర్థ్యంతో టికెట్ ధర రూ.50తో బోట్లను ఏర్పాటు చేశారు. బోట్లలో విహార యాత్ర సౌకర్యం ఉండటం, సీబీఆర్‌కు అటు, ఇటు పచ్చని అరటి తోటలు, వరిమళ్లు ఉండటంతో పచ్చదనంతో కోనసీమను తలపిస్తోంది. దీంతో పర్యాటకుల తాకిడి అధికమైంది. పార్నపల్లి సమీపంలో కోనమల్లేశ్వర క్షేత్రం, తాడిమర్రి మండలం దాడితోట సమీపంలో చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రం ఉండటంతో భక్తులు ఆలయాలను దర్శించుకుని అనంతరం సీబీఆర్‌కు వచ్చి సరదాగా గడుపుతున్నారు.



సీబీఆర్ జలాల్లో పర్యాటకుల బోటు విహారం

### జగన్ హయాంలో సీబీఆర్ అభివృద్ధి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) అభివృద్ధి జరిగింది. పర్యాటకులకు వసతులు, సౌకర్యాలు కల్పించాడానికి ఆయన గతేడాది రూ.కోట్లు నిధులు విడుదల చేశారు. దీంతో అక్కడ వసతి గృహాలు, రెస్టారెంట్, డ్యామ్‌లో విహార యాత్ర కోసం బోట్లు ఏర్పాటు చేశారు. పార్కుతోపాటు పిల్లలు ఆడుకోవడానికి ఉయ్యాలు ఏర్పాటు చేశారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులు ఎంతో సంతోషంగా గడిపి వెళుతున్నారు.

–సిద్దే రవీంద్రారెడ్డి, మోదుగులకుంట, తాడిమర్రి

### కోనసీమను తలపిస్తున్న సీబీఆర్ అందాలు



శ్రీసత్యసాయి జిల్లాలోని మండల సరిహద్దులో పార్నపల్లి వద్ద ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(సీబీఆర్) అందాలు కోస్తా జిల్లాలోని కోనసీమ అందాలను తలపిస్తున్నాయి. డ్యామ్‌కు ఇరువైపులా పచ్చని అరటి, చీనీ, జామ, వరి తదితర పంట పొలాలు, డ్యామ్‌కు ఇరువైపులా కొండలు యాత్రికులకు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. డ్యామ్ సందర్శనకు వస్తే బాధలు అన్నీ మైమరచి ఎంతో హాయిగా గడపొచ్చు. డ్యామ్‌లో ఏర్పాటు చేసిన బోట్లలో విహరిస్తూ ఉంటే మరింత ఆనందాన్ని ఇస్తున్నాయి. ఎంత చూసినా తనివితీరని అందాలు సీబీఆర్ సొంతం.

–గద్దె రాజేష్‌రెడ్డి, దాడితోట, తాడిమర్రి

## రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్‌లో వాగ్వాదం చేసుకుంటున్న కౌన్సిలర్లు

**పుట్టపర్తి టౌన్:** మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి ఆధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. టీడీపీ కౌన్సిలర్ రత్నప్ప చౌదరి గతంలో నిధులు కాజేశారంటూ ఆరోపణలు చేయడంపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మండిపడ్డారు. తీవ్రస్థాయిలో వాగ్వాదం జరగడంతో సీఐ సునీత కలగజేసుకుని వారిని శాంతింపజేశారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ ఇప్పించాలని, సాయినగర్‌లో శ్మశాన వాటికకు రహదారి సమస్య తీర్చాలని వైస్ చైర్మన్ తిప్పన్న సభ దృష్టికి తీసుకొచ్చారు. సీసీరోడ్లు నిర్మించాలని, వేసవి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని 4వ వార్డు కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి కోరారు. డ్రైనేజీలపై మూతలు తెరిచి ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, పట్టణంలో పారిశుద్ధ్య చర్యలు మెరుగుపర్చాలని 8 వార్డు కౌన్సిలర్ సాయిగీత అధికారులను కోరారు. కర్ణాటకనాగేపల్లి నుంచి సాయినగర్ వరకు ఫోర్‌లైన్ రింగ్‌రోడ్డు నిర్మించాలని అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలని విన్నవించారు. త్వరలో జరిగే సత్యసాయిబాబా జయంత్యుత్సవాలకు పక్బందీగా ఏర్పాట్లు చేయాలని కోరారు.

**ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ప్రమాణం..**

ఎమ్మెల్యే సింధూరారెడ్డితో కమిషనర్ ప్రహ్లాద మున్సిపల్ ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ప్రమాణం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా పుట్టపర్తి కొనసాగుతుందన్నారు. అందరి సహకారంతో పుట్టపర్తి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## ఆలయాల్లో రేపు వైఎస్సార్‌సీపీ పూజలు



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్ కేశవరెడ్డి తదితరులు

**పుట్టపర్తి:** తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూపై సీఎం చంద్రబాబు అసత్య ఆరోపణలకు నిరసనగా శనివారం ఉదయం 9 గంటలకు నియోజకవర్గవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆపార్టీ నేతలు తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపు మేరకు పుట్టపర్తిలోని సత్యమ్మ ఆలయం సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మిగిలిన మండలాల వారు ఆయా మండల కేంద్రాల్లో ఆలయాలలో ప్రత్యే పూజలు నిర్వహిస్తారని తెలిపారు. సీఎం చంద్రబాబు హిందువుల మనోభావాలు దెబ్బతినేలా తిరుమల లడ్డూపై వ్యాఖ్యలు చేశారని, ఇందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, కౌన్సిలర్లు సూర్యాగౌడ్, భాస్కర్‌రెడ్డి, పట్టణ ,రూరల్ కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, మాజీ రూరల్ కన్వీనర్ గంగాద్రి, మాజీ కౌన్సిలర్ నారాయణ రెడ్డి, సాయి, జిల్లా అగ్రీ అడ్వైజరీ బోర్డు మాజీ అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి, విశ్రాంత ఎంఈఓ కత్తి నాగిరెడ్డి, రఘునాథరెడ్డి, సందీప్‌నాయుడు, చంద్ర, ఓబిలేసు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**బత్తలపల్లి:** విద్యార్థులు, ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సాయిమనోహర్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలని సూచించారు. అవాంఛిత యాప్‌లను క్లియర్ చేసుకోవాలని సూచించారు. అనంతరం సచివాలయాలు, పరిసరాలను, ఇతరత్రా ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాలను శుభ్రం చేశారు. పొదుపు సంఘాల మహిళలకు పిల్లల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈఓఆర్డీ దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీలతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నలూ పంట తొలగించొద్దు

- జిల్లా హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్

సాక్షి ఎఫెక్ట్..



పోట్లమర్రిలో రమణారెడ్డి సాగు చేసిన మిరప పంటను పరిశీలిస్తున్న డీహెచ్‌ఓ చంద్రశేఖర్

**బత్తలపల్లి:** మిర్చి ధరలు పతనం అవుతున్నాయన్న కారణంతో రైతులు ఎవ్వరూ తొందరపడి పంటను తొలగించవద్దని, ఎవరూ అధైర్యపడవద్దని వచ్చే నెల నుంచి మార్కెట్‌లో మంచి ధరలు ఉంటాయని జిల్లా హార్టికల్చర్ అధికారి(డీహెచ్‌ఓ) చంద్రశేఖర్ రైతులకు సూచించారు. గురువారం 'సాక్షి'లో 'మిర్చి రైతు కుదేలు' శీర్షికన కథనం వెలువడడంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు బత్తలపల్లి, ధర్మవరం మండలాల్లో గురువారం జిల్లా హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్, వీహెచ్‌ఏ భార్గవ్, వీఎస్‌ఏ ముత్యాలప్ప, వెల్ఫేర్ అసిస్టెంట్ మంజునాథ పర్యటించారు. పోట్లమర్రి, రాఘవంపల్లి, చిగిచెర్ల గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిర్చి పంటను పరిశీలించారు. రైతులు తమ ఆవేదనను వారికి వివరించారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పంటలను సాగు చేస్తే లాభాలు కాదు కదా, పెట్టుబడులు చేతికి అందలేదని వాపోయారు. మార్కెట్‌లో ధరలు పడిపోవడం, తెగుళ్లు సోకి పంటలు నష్టపోతున్నామన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. తెగుళ్లు సోకిన పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణా చర్యలను డీహెచ్‌ఓ వివరించారు. మార్కెట్‌లో మిర్చి ధరలు పడిపోయాయని నిరాశకు గురై పంటలను ఎవ్వరూ తొలగించవద్దన్నారు. మంచి ధరలు రాబోతున్నాయని ఎవరూ అధైర్యపడొద్దని వారికి భరోసా కల్పించారు.

## తాడిమర్రి అభివృద్ధికి కృషి




మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

**తాడిమర్రి:** మండలాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద గురువారం అధికారులు నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు హంద్రీనివా నీటిని తెప్పించి పీఏబీఆర్ ద్వారా మండలంలోని అన్ని చెరువులను నింపుతామన్నారు. అలాగే తాడిమర్రి ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రి, ధర్మవరం ఆసుపత్రిని 150 పడకల ఆసుపత్రిగా చేస్తానన్నారు. అలాగే నియోజక వర్గంలోని కిడ్నీ బాధితుల కోసం ధర్మవరంలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తానన్నారు. తాడిమర్రి మండలం, పిన్నదరి గ్రామాలను దత్తత తీసుకుని ఆదర్శ గ్రామాలుగా తీర్చి దిద్దుతానని పేర్కొన్నారు. అంతకుముందు ముందుగా నిడిగల్లు గ్రామం వద్ద నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరై డ్రోన్ ద్వారా కందిపంటకు పురుగు మందును పిచికారీని ప్రారంభించారు. తాడిమర్రిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వైశ్యులు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు. .

**బత్తలపల్లి:** మండల కేంద్రంలోని లలితా త్రిపుర సుందరి సమేత ఓంకారేశ్వర ఆలయంలో ఓంకారేశ్వరున్ని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ గురువారం దర్శించుకున్నారు. ఆలయ శాశ్వత ధర్మకర్త కోటి సూర్యప్రకాష్‌బాబు మంత్రికి స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

## జిల్లాస్థాయి పోటీలకు బత్తలపల్లి విద్యార్థులు



జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో పీఈటీలు



జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులు

**బత్తలపల్లి:** ధర్మవరంలో జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ చాటిన బత్తలపల్లి మండల విద్యార్థులు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు అర్హత సాధించారు. గురువారం ధర్మవరంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో బత్తలపల్లి విద్యార్థులు అండర్-14 బాలుర విభాగంలో కబడ్డీ విన్నర్స్, అండర్-17 బాలుర కబడ్డీలో రన్నర్‌గా, అండర్-14 బాలుర వాలీబాల్ రన్నర్స్‌గా నిలిచారు. వీరు అనంతపురంలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. పీడీలు లక్ష్మీనారాయణ, రాజశేఖర్, లాల్‌బాషా, జగదీష్, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

**రాణించిన గురుకుల పాఠశాల విద్యార్థులు...**

బత్తలపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల(రేగాటిపల్లి) విద్యార్థులు నియోజకవర్గస్థాయిలో పోటీలలో రాణించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ దేవరకొండ మాధవి తెలిపారు. అండర్-17 ఖోఖోలో అభిషేక్, విష్ణు, వరుణ్, అండర్-14 ఖోఖోలో పవన్, వరుణ్, ఫణీంద్ర, అండర్-17 వాలీబాల్‌లో వంశీ, విష్ణు, కిరణ్, అండర్-17 కబడ్డీలో విష్ణు, వరుణ్, అజయ్‌లు, అండర్-14 కబడ్డీలో గౌతమ్, హరి రాణించినట్లు వివరించారు. వీరిని ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు అభినందించారు.

**ధర్మవరం రూరల్:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం కూడా వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింట పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కోఆర్డినేటర్ నాగేంద్ర మాట్లాడుతు నియోజక వర్గ స్థాయిలో ఎంపికై న క్రీడాకారులు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ రఘునాథ రావు, పీఈటీలు నారాయణ స్వామి, లక్ష్మీనారాయణ, మల్లేష్, లాల్‌బాషా, శాంత లింగం, రేఖ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని పూజితతో పీడీ సురేష్

**లేపాక్షి:** స్థానిక నీలం సంజీవరెడ్డి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బి.పూజిత రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వీవీసి గిరి, ఫిజికల్ డైరెక్టర్ సురేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబరిచనట్లు పేర్కొన్నారు. త్వరలో గుంటూరు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-17 ఫుట్‌బాల్ పోటీల్లో అనంతపురం జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహిస్తుందన్నారు.

## క్లుప్తంగా


### బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ గోపి

**తనకల్లు:** బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలని ఎస్‌ఐ గోపి అన్నారు. బొంతలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్‌ఐ పలు చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికలు బాగా చదువుకోవడం ద్వారా కుటుంబంతో పాటు సమాజంలోనూ మంచి గుర్తింపు దక్కుతుందన్నారు. బాలికలపై అఘాయిత్యాలకు ప్రయత్నిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమ్మాయిలను మానసికంగా, శారీరకంగా వేధించడం, ఈవ్ టీజింగ్, లైంగిక దాడి పాల్పడితే పోక్సో చట్టం కింద కేసులను నమోదు చేస్తామని పేర్కొన్నారు. బాలికలు ఏ రకమైన వేధింపులకు గురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎన్‌టీఏ నూతన కార్యవర్గం ఎన్నిక



శివశంకర్, మండలాధ్యక్షుడు

**తనకల్లు:** స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండల నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మురళీస్వామి, అధ్యక్షుడిగా శివశంకర్, ప్రధాన కార్యదర్శి రామచంద్ర, మహిళా కార్యదర్శిగా అరుణమ్మ, సహాయ కార్యదర్శి రోజశ్రీ, సభ్యులుగా ప్రకాష్, రమేష్‌తో పాటు మరో పది మందిని ఎంపిక చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటం చేస్తామని ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం

**ధర్మవరం రూరల్:** పోతుకుంట గ్రామం వద్ద గురువారం స్కార్పియోను ఆటో ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు.. కుణుతూరు గ్రామానికి చెందిన అఖిలానందరెడ్డి, జనార్ధన్, యశ్వంత్‌రెడ్డి ఆటో డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. ధర్మవరం నుంచి పోతుకుంట వైపు వేగంగా వెళ్లారు. ఈక్రమంలో ఎదురుగా వచ్చిన స్కార్పియో వాహనాన్ని ఢీకొట్టారు. ఆటోను తప్పించే క్రమంలో స్కార్పియో వాహనం రోడ్డు పక్కన వున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఘటనలో ముగ్గురూ స్వల్పగాయాలతో బయటపడ్డారు.

### దుప్పట్ల పంపిణీ

**నల్లచెరువు:** తవళంమర్రి గ్రామంలో గురువారం అరుణోదయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగమల్లు ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు, నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ శకుంతల, డీఎల్‌పీఓ ఆంజనప్ప అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు చంద్రానాయక్ పాల్గొన్నారు.

### 'పీఎం సూర్యఘర్' వినియోగించుకోండి

**హిందూపురం:** పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భూపతి తెలిపారు. గురువారం పట్టణంలోని పాండురంగ నగర్‌కు చెందిన ప్రతిభ ఓబులేసు మిత్రకు 25 ఏళ్ల కాలానికి విద్యుత్ కొనుగోలుకు ఒప్పందపత్రం అందజేశారు. సోలార్ సిస్టం ద్వారా నెలకు 400 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. తద్వారా ఇంటి బిల్లు 90 శాతం ఆదా అవుతుందని పేర్కొన్నారు. సోలార్ సిస్టం అమర్చు కోవడం వల్ల పర్యావరణ పరిరక్షణతోపాటు రూ.78 వేలు సబ్సిడీ అందుతుందన్నారు.

### తెలంగాణ పోరాటంలో ఐలమ్మ పాత్ర కీలకం



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

**పుట్టపర్తి టౌన్:** తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ కీలక పాత్ర వహించిందని రజక సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం ఆమె 129 జయంతి సందర్భంగా కొత్తచెరువులో ఉన్న రజక సంఘం భవన్‌లో ఆ సంఘం నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివప్ప మాట్లాడుతూ తన ప్రాణాలను లెక్క చేయకుండా పెత్తందారులు భూస్వాములు, రజాకర్లపై పోరాటం చేసి లక్షల ఎకరాలు బడుగు బలహీన వర్గాలకు భూ పంపిణీలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఎర్రజెండా చేపట్టి తన ఇంటినే కమ్యూనిస్టు కార్యాలయం ఏర్పాటు చేసిన వీర వనిత అని కొనియాడారు. సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు నారాయణ, నాయకులు ఓబుళసు, రాధమ్మ, సాలెమ్మ, భారతి, యశోద, వెంకటక్ష్మమ్మ, నరసమ్మ, కాంతమ్మ, తిరుపాలు, మురళీ, మల్లికార్జున పాల్గొన్నారు.

### పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

**చెన్నేకొత్తపల్లి:** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. మండల పరిధిలోని సుబ్బరాయనిపల్లి గ్రామంలో గురువారం ఎన్‌ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులు, బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకట నారాయణ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఎంఎల్‌హెచ్‌పీ భార్గవి, ఏఎన్‌ఎం కుమారి, ఆశావర్కర్, 104 సిబ్బంది పాల్గొన్నారు.

### జిల్లా స్థాయి పోటీలకు 'బ్లూమూన్' విద్యార్థులు



జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**కదిరి అర్బన్:** స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పట్టణంలోని బ్లూమూన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ -14 ఖోఖో బాలికల విభాగంలో హర్షిత, నవ్యత, బాలుర విభాగంలో రోహిత్, అండర్-17 ఖోఖో బాలికల విభాగంలో దీక్షిత్‌రెడ్డి, శ్రీజరెడ్డి, బాలుర విభాగంలో వెంకటసాయి, అండర్-14 కబడ్డీ బాలికల విభాగంలో పావని బాలుర విభాగంలో సమీర్‌రెడ్డి ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత శివశంకర్, ప్రధానోపాధ్యాయుడు సురేంద్రరెడ్డి తదితరులు అభినందించారు.

### విద్యుదాఘాతంతో ఇద్దరికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న భార్గవ్



బాబయ్య

**ధర్మవరం అర్బన్:** పట్టణంలో మిద్దెపై బేల్దారి పని చేస్తున్న ఇద్దరు వ్యక్తులు విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని శారదానగర్‌లో నివసిస్తున్న బాబయ్య, భార్గవ్ ఇంటిపైన బేల్దారి పనిచేసేందుకు కొలతలు తీసుకుంటున్నారు. మిద్దెపైనున్న విద్యుత్ మెయిన్ లైను బాబయ్యకు తగిలి కరెంట్‌షాక్‌కు గురయ్యాడు. గమనించిన భార్గవ్ బాబయ్యను కాపాడే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన స్థానికులు వారిద్దరిని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### అభివృద్ధి సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

**పుట్టపర్తి టౌన్:** అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే సింధూరారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎంతో పురోగతి సాధించామన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అధికారులు పాల్గొన్నారు.

### మృతురాలి ఆచూకీ గుర్తింపు

**కదిరి అర్బన్:** దేవరచెరువులో ఈ నెల 25న గుర్తు తెలియని మహిళ పడి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతురాలు కదిరిలోని రాధాక్రిష్ణవీధికి చెందిన నూర్జహాన్‌గా రూరల్ మండల పోలీసులు గుర్తించారు. మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.